ధాన్యం రవాణాకు లారీల కొరత

- త్వరగా దిగుమతి చేసుకోని మిల్లర్లు
- కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన నిల్వలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



గూడపూర్ కొనుగోలు కేంద్రంలో మిల్లుకు తరలించకుండా ఉంచిన ధాన్యం

మునుగోడు: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని స్థానిక మిల్లులకు రవాణా చేసేందుకు లారీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సరిపడా లారీలు రాకపోవడంతో వారం రోజుల క్రితమే పూర్తి కావాల్సిన కొనుగోళ్లు నేటికీ పూర్తి కాలేదు. మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యం లారీలను మూడు, నాలుగు రోజులపాటు దిగుమతి చేయకుండా అక్కడే పడిగాపులు కాయించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ధాన్యం దిగుమతి చేసుకుంటున్నారు. మిల్లుల వద్ద వేచి ఉండాల్సి వస్తుండడంతో మరోసారి ధాన్యం రవాణా చేసేందుకు లారీల యజమానులు ముందుకు రావడం లేదు.

అంతంత మాత్రంగా కొనుగోళ్లు..

మునుగోడు మండల వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 16 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చి ధాన్యం వారం రోజులపాటు ముమ్మరంగా కొనుగోలు చేశారు. అనంతరం మిల్లుకు వెళ్లిన లారీలు నాలుగైదు రోజులకు తిరిగి వస్తుండడంతో కొనుగోళ్లలో తీవ్రంగా జాప్యం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఒక్కో కేంద్రంలో దాదాపు 30 నుంచి 80 మంది చొప్పున దాదాపు మొత్తం 500 మంది రైతుల ధాన్యం రాశుల కుప్పలు పేరుకుపోయాయి. ఒక్కో రైతు కనీసం 20 రోజులకు పైగా పడిగాపులు కాస్తే తప్ప ధాన్యం అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.

లారీ కిరాయిలు చెల్లించాలంటున్న నిర్వాహకులు..

మిల్లుల వద్ద వెంటవెంటనే ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో లారీ యజమానులు తిరిగి కొనుగోలు కేంద్రాలకు రావడం లేదు. తిరిగి రావాలంటే అదనంగా లారీ కిరాయి డబ్బులు ఇవ్వాలని రైతులను అడుగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అదనపు కిరాయి ఇవ్వకుంటే ధాన్యం మిల్లులకు తరలించేందుకు లారీల యజమానులు ముందుకురావడం లేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఒక లోడుకు కేవలం రూ.7వేలు మాత్రమే వస్తోందని, నాలుగైదు రోజులు ఖాళీగా ఉంటే తమకు గిట్టుబాటు కావడంలేదని చెబుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. రోజువారీ డ్రైవర్ జీతంతోపాటు వెయిటింగ్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి మిల్లర్లను ఒప్పించి ధాన్యం వెంటవెంటనే దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మిల్లర్లు సహకరించాలి



“ ధాన్యం లారీలను వేచి ఉంచకుండా మిల్లు యజమానులు వెంటనే దిగుమతి చేసుకుని సహకరించాలి. లారీ యజమానులు వెయింటింగ్ పేరుతో రైతులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను డబ్బులు అడగడం సరికాదు. అధికారులు శ్రద్ధ తీసుకుని మిల్లులకు వెళ్లిన లారీలను వెంటనే దిగుమతి చేసుకునేలా చూడాలి.

–దోటి నారాయణ, చండూరు మార్కెట్ చైర్మన్

పది రోజుల తర్వాత తూకం వేశారు



“ పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చాను. అప్పటి నుంచి నా ధాన్యం తూకం వేయాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను బతిమిలాడాను. పది రోజుల తర్వాత తూకం వేశారు. కానీ లారీలు రాకపోవడంతో ధాన్యం అక్కడే ఉంచారు. వర్షం వస్తే ధాన్యం బస్తాలు తడుస్తాయోమోనని భయంగా ఉంది.

–కంచి యాదయ్య, రైతు గూడపూర్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలింగమంతులస్వామి, గంగాభవాని, పెద్దమ్మ తల్లి, ఆకుమంచమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. మహిళలు బోనాలు తెచ్చి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా పాల్గొని పూజలు చేశారు. ఈ వేడుకల్లో పెద్దగొల్ల వీరయ్య, ఆలయ చైర్మన్ చింతల సైదులు, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్ రావు, ఎస్వీఆర్ ఫౌండేషన్ చైర్మన్ సందినేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ప్రగడపు నవీన్‌రావు, మాజీ ఉప సర్పంచ్ చింతల శ్రీను, పాల సంఘం చైర్మన్ చింతల ముత్తయ్య, లింగస్వామి, చిర్రబోయిన సైదులు, జాల శంకరయ్య, పాక సత్తయ్య, జాల కోటిలింగం, జాల సైదులు, ముప్పిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

గంగదేవమ్మ పండుగ

కట్టంగూర్ : మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న గంగదేవమ్మ ఆలయంలో గంగదేవమ్మ పండుగను యాదవ కులస్తులు సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యాదవులు గంగ తెప్పను తీసి, అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని డోలు వాయించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, పెద్దగొల్ల ముక్కాముల వెంకన్న, ముక్కాముల శేఖర్, గట్టిగొర్ల యాదగిరి, గట్టిగొర్ల సత్తయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు ముక్కాంల యాదయ్య, ఉపాధ్యక్షుడు గట్టిగొర్ల గంగరాజు, వెంకటేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



కట్టంగూర్ : ఆలయం వద్ద డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రశాంతంగా కల్లు గీత సంఘం ఎన్నికలు



గెలిచిన అభ్యర్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : పట్టణంలో కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తాటికల్ రోడ్డులోని సంఘం కల్యాణ మండపంలో రహస్య బాలెట్ పద్ధతిన జరిగిన ఎన్నికలకు రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సంఘంలో మొత్తం 780 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం తొమ్మిది డైరెక్టర్ల పదవులకుగాను ఒక స్థానం ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో ఏకగ్రీవమైంది. మిగతా ఎనిమిది డైరెక్టర్ల పదవుల కోసం ఎన్నికలు నిర్వహించారు.

గీత సంఘం ఓట్ల లెక్కింపు పూర్తి

నకిరేకల్ కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తరపున నిలిచిన ప్యానెల్ ఘన విజయం సాధించింది. సోమవారం మధ్యాహ్నం తరువాత ఎన్నికల అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం 780 ఓట్లకు గాను 714 ఓట్లు పోల్ అయ్యాయి. వీటిలో 84 ఓట్లు చెల్లని ఓట్లుగా పరిగణించారు. మిగతా 630 ఓట్లలో అత్యధిక ఓట్లతో కొండ వెంకన్న, చొగోని నాగయ్యగౌడ్, చొగోని వెంకన్నల ప్యానెల్ విజయం సాధించింది. మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్ల గాను ఎస్సీ నుంచి బొప్పని సైదులు ఏకగ్రీవంగా కాగా మిగతా ఎనిమిది డైరెక్టర్ల పదవులకుగాను 16 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో ఎనిమిది మంది ఒకే ప్యానల్ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి నాగేశ్వర్‌రావు ప్రకటించారు. విజేతలకు ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

విజేతలు వీరే..

విజయం సాధించిన వారిలో కొండ వెంకన్న, చొగోని నాగయ్య, చొగోని వెంకన్న, తలారి వీరమ్మ, కొండ యాదమ్మ, తండు వెంకటేశ్వర్లు, కొండ శ్రీను, మల్లెబోయిన దశరథ, బొప్పని సైదులు(ఏకగ్రీవం)లు ఉన్నారు.

ఎమ్మెల్యే అభినందన

ఎన్నికల్లో విజయం సాధించిన తొమ్మిది మంది డైరెక్టర్లు సోమవారం రాత్రి పట్టణంలో విజయోత్సవ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు.

‘గ్రీవెన్స్’లో ఫిర్యాదుల వెల్లువ



రామగిరి(నల్లగొండ): కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కవులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కళాభారతి నిర్మాణం చేపట్టాలని కోరుతూ నల్లగొండకు చెందిన కవులు కళాకారులు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నల్లగొండలో గతంలో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి టౌన్ హాల్ ఉండేదని, అది శిథిలం కావడంతో నేలమట్టం చేశారని, ప్రస్తుతం సాహిత్య సభలు నిర్వహించుకోవడానికి తగిన వేదిక లేదని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కోమలి కళా సమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ళ ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని..

గట్టుప్పల్ : మండలంలోని వెల్మకన్నె గ్రామంలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం ఆ గ్రామస్తులు కలెక్టర్, ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందని గత సంవత్సరం తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

మట్టిని తరలిస్తున్న వారిపై ఫిర్యాదు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ పరిశ్రమకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఆ గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లం మహేష్ ఫిర్యాదు చేశారు. పర్యావరణం దెబ్బతినేవిధంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు వివరించారు. మట్టి తరలింపును నిలిపివేయాలని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు దేశబోయిన నర్సింహ, శంభయ్య పాల్గొన్నారు.

200 రోజులు పని కల్పించాలి

చండూరు : ఉపాధి హామీ పనులను సంవత్సరంలో 200 రోజులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగూరి నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండలంలోని నెర్మట గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు జానిమియా, ఊషయ్య చండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, సంజీవ పాల్గొన్నారు.

మునుగోడు: ఉపాధి హామీ కూలీలకు పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ కోరారు. సోమవారం మునుగోడులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట నియోజకవర్గ అధ్యక్షుడు ఎండీ జానిమియా, అంజయ్య తదితరులు ఉన్నారు.

సర్వే ముమ్మరం చేయండి

మర్రిగూడ : రేషన్‌కార్డుల సర్వే ముమ్మరంగా చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం కార్యాలయంలో ఆయా గ్రామాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. కార్యక్రమంలో డీటీ కె.చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, ఆర్ఐ పాండు రంగారెడ్డి, సర్వేయర్ స్వప్న, సువర్ణ పాల్గొన్నారు.

టీపీఏ ఆవిర్భావ దినోత్సవం

నల్లగొండ: పట్టణంలోని స్రవంతి పాఠశాలలో సోమవారం టీపీఏ (తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీపీఏ జిల్లా అధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు , అరుణ శోభ , రజనీకాంత్, వెంకటరమణ పాల్గొన్నారు.

వేసవి శిక్షణశిబిరం ప్రారంభం

గట్టుప్పల్ : వెల్మకన్నె గ్రామంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు రావుల ఎల్లప్ప, జిల్లా కార్యదర్శి చిలువేరు దుర్గయ్య ప్రారంభించారు. దెండే సత్య గణేశ్, వరుణ్,నవదీప్, శ్రీశైలం, భరత్, శ్వేత, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు ప్రామాణికం



రామగిరి(నల్గొండ): రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాస్

రామగిరి(నల్గొండ): కేంద్ర ప్రభుత్వ పథకాలకు విశిష్ట గుర్తింపు కార్డు ప్రామాణికమని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పానగల్ రైతు వేదికలో విశిష్ట గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెలతో విశిష్ట గుర్తింపు కార్డు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మొదటగా వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో నమోదుకు అవకాశం కల్పించారని, త్వరలో మీసేవ కేంద్రాల్లో కూడా నమోదు చేసుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అబ్దుల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘ఫార్మర్ రిజిస్ట్రీ’ చేయించుకోవాలి

కేతేపల్లి: రైతులకు 11 అంకెలతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డులు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతుల నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ)ను చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం తెలిపారు. సోమవారం కేతేపల్లిలోని రైతు వేదిక భవనంలో చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు జనవరి 1, 2025 నాటికి డిజిటల్ సైన్ అయిన రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ నంబర్ లింక్ అయిన ఫోన్‌తో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే పథకాల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. రైతుల విశిష్ట సంఖ్యకు..రాష్ట్రంలో అమలయ్యే రైతు భరోసా, రుణమాఫీ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ బాలరాజు, రైతులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి

నల్లగొండ టౌన్: మోదీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మికులు, రైతులు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. సోమవారం నల్లగొండలో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య, వి వెంకటేశ్వర్లు, బండ శ్రీశైలం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో హమాలీ కార్మికులందరూ పాల్గొనాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య కోరారు. సోమవారం నల్లగొండలో పట్టణ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం స్టీల్ సిమెంట్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు వనమా దామోదర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో అవురేషు మారయ్య, కాడింగు రవికుమార్, చింతపల్లి శేఖర్ పాల్గొన్నారు.

మర్రిగూడ : కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సల్వోజు రామలింగాచారి, నక్క నరసింహ, ఒంపు ముత్తమ్మ, సిలివేరు మహేష్, గ్యార దుర్గమ్మ, ఆవుల ముత్తయ్య, ఐతపాక పద్మ, జంగమ్మ, ఇంద్రమ్మ, నర్సమ్మ, శ్రీను, ఎడ్ల నరసింహ, ఎడ్ల ఈశ్వరమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా యూటీఎస్‌సీ మెడికల్ అధికారిణి డాక్టర్ శాలినికి సోమవారం ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, సీఐటీయూ మండల నాయకుడు సల్వోజు రామలింగాచారి, ఆశా కార్యకర్తలు జంపాల వసంత, రమావత్ జయమ్మ, కేశగోని మంజుల, ఎస్‌కె.సైదాబి, పల్లె కౌసల్య, పొగాకు అలివేలు మంగా, రమావత్ లక్ష్మీ పాల్గొన్నారు.

నిజదేవుడు ఏసుక్రీస్తు చర్చి వార్షికోత్సవం



ప్రార్థనలు చేస్తున్న మార్నేని థామస్

కేతేపల్లి: మండలంలోని భీమారం గ్రామంలో నిజదేవుడు ఏసుక్రీస్తు మినిస్ట్రీస్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మార్నేని థామస్ నేతృత్వంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భీమారంతోపాటు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి క్రైస్తవులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. పండగ ఈ సందర్భంగా క్రైస్తవ భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా వాసవీమాత జయంతి ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని రామకోటి ఆలయంలో వాసవీమాత కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 108 రకాల చీరలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ ఓరుగంటి పరమేష్, కన్వీనర్ ఓరుగంటి కరుణ, ఏచూరి ధృవకుమార్, గజ్జల వెంకటేశ్వర్లు, కుక్కడపు శ్రీనివాస్, విశ్వప్రసాద్, రేపాల భద్రాద్రి రాములు, పారేపల్లి శ్రీనివాస్, బండారు వెంకటేశ్వర్లు, ఆరూరు సత్యనారాయణ, గుడిపాటి సత్యనారాయణ, సోమవరపు రాజేశ్వరరావు, శివకోటి నెహ్రూ, మిట్టపల్లి రాజేందర్, ఇడుకుళ్ల దేవేందర్, కిషన్, మిట్టపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామన్నయాదవ్‌కు నివాళి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని వీటీకాలనీలో సోమవారం యువజన సంఘం ఆధ్వర్యంలో ఆవుల రామన్నయాదవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సిరిగిరి సురేష్ రెడ్డి, యుగంధర్‌రెడ్డి, సుకారపు యాదగిరిగౌడ్, పాలకూరి నరసింహ, ఆవుల నాగరాజు, బత్తిని యాదగిరి, పసుపులేటి మీని, చక్రపాణి, రాజశేఖర్, వెంకన్న, నితీష్ రెడ్డి, హరితేజ, సంతోష్, పరుశురాం, యాదగిరి, రాము, సాయికుమార్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నల్లగొండ: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను కాంగ్రెస్ కార్యకర్తల ఇళ్ల జాబితాగా మార్చిన అధికారులపై విచారణ చేయాలని ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం పీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపాల్, ఉయ్యాల లింగస్వామిగౌడ్, నాగిళ్ల యాదయ్య, బర్రె సంజీవ, ఆవుల నరసింహయాదవ్, మాదగోని పద్మ, గుణగంటి అండాలు, ఉయ్యాల ధనమ్మ పాల్గొన్నారు.

చిట్యాల: అనర్హులను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చేర్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి ఆధ్వర్యంలో చిట్యాల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ జయలక్ష్మీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కాల గోపాల్, ఉయ్యాల లింగస్వామిగౌడ్, నాగిళ్ళ యాదయ్య, బర్రె సంజీవ, ఆవుల నర్సింహ, మాదగోని పద్మ, అండాలు, ఉయ్యాల ధనమ్మ, సునిత, కృష్ణయ్య, లలిత, సైదులు పాల్గొన్నారు.

ఎన్జీ కాలేజీ లెక్చరర్‌కు డాక్టరేట్



రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలకు చెందిన భౌతిక శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి డాక్టరేట్ (పీహెచ్‌డీ) అందుకున్నారు. నిడమనూరు మండలం నర్సింహులగూడెంకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్, హెచ్‌సీయూలో ఎంఫిల్ పూర్తి చేశాడు. సీఎస్ఐఆర్ జాతీయ అర్హత పరీక్షలో 3 సార్లు అర్హత సాధించాడు. 2011లో ఏపీపీఎస్సీ పరీక్ష రాసి స్టేట్ 7వ ర్యాంకు సాధించి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ ఎం శ్రీనాథ్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆన్ నేషనల్ బ్యాగ్రౌండ్ రేడియేషన్ లెవల్స్ ఇన్ దేవరకొండ అండ్ ఇట్స్ సరౌండింగ్ విలేజెస్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. పరిశోధనలో భాగంగా దేవరకొండ సమీపములో చిత్రియాల గ్రామంలో యురేనియం , థోరియం నిక్షేపాల వల్ల పరిసర గ్రామాల ప్రజలపై రేడియేషన్ ప్రభావంపై అధ్యయనం చేసి జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధన పత్రాలను సమర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం: మండలంలోని చిత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నాడు విద్యాబోధన చేసిన పాఠశాల ఉపాధ్యాయులు కందుల సోమయ్య, జనార్దన్, రాంరెడ్డి, మల్లయ్య, శ్యాంసుందర్, వెంకన్న, మైసయ్య, సుందరి, మల్లికార్జున్‌లను పూర్వవిద్యార్థులు పూలమాలలు, శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు.

కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

చండూరు : పుల్లెంలలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ధాన్యం తరలించడానికి లారీలు రావడం లేదని గ్రామస్తులు ఫోన్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. లారీలు అందుబాటులో ఉంచాలని లేకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, తహసీల్దార్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన చైర్మన్

గుండ్రపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ పరిశీలించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.

బస్సు ఎదుట మహిళ నిరసన

నకిరేకల్ : ఆర్టీసీ బస్సులో కల్లు తీసుకువెళ్తున్న ఓ మహిళను బస్సు నుంచి కిందికి దింపారు డ్రైవర్, కండక్టర్. దీంతో ఆ మహిళ ఆ బస్సును పోనివ్వకుండా ముందు నిలబడి నిరసన తెలిపింది. ఈ సంఘటన నకిరేకల్‌లోని పద్మానగర్ జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకోగా సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. సూర్యాపేట ఆర్టీసీ డిపోకు చెందిన టీఎస్ 23–8669 నంబర్ గల బస్సు నల్లగొండకు వెలుతోంది. నకిరేకల్‌లో ఓ మహిళ సంచుల్లో కల్లు బాటిళ్లు తీసుకుని బస్సు ఎక్కింది. మహిళ సంచుల్లో కల్లు బాటిళ్ల క్యాన్ ఉన్న విషయాన్ని గమనించిన కండక్టర్, డ్రైవర్.. ఆమెను నకిరేకల్ పద్మానగర్ జంక్షన్ వద్ద బస్సు నుంచి కిందకు దింపారు. దీంతో సదరు మహిళ ఆగ్రహంతో బస్సు ముందు అడ్డంగా నిలబడి వాగ్వాదానికి దిగింది. కల్లు తీసుకుపోవద్దని ఏమైనా రూల్స్ ఉన్నాయా అంటూ ఆగ్రహంతో ఊగిపోయింది. ఆ తరువాత ఆమెను పలువురు పక్కకు జరపడంతో ఆ బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది.

క్లుప్తంగా

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: పట్టణంలో సోమవారం మృతి చెందిన గందె అనసూర్య అనే వృద్ధురాలి నేత్రాలను మృతురాలి కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్టు ఐ డొనేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు సేకరించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి సోమవారం తెలిపారు. ఈ నెల 20 వరకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

శాలిగౌరారం: ఇటీవల తండ్రిని కోల్పోయిన స్నేహితుడికి అతడితోపాటు చదువుకున్న ఎస్సెస్సీ 2003–04 బ్యాచ్‌కు చెందిన సహచరులు బాసటగా నిలిచారు. మండలంలోని తిరుమలరాయునిగూడెంకు చెందిన బండారు యాదయ్య అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతిచెందాడు. ఈ సందర్భంగా అతడి కుమారుడు వెంకటేశ్వర్లుతో కలిసి చదువుకున్న స్నేహితులు ఆ కుటుంబానికి సోమవారం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, సతీష్, కృష్ణమూర్తి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు: మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన యువకులు మర్రి మురళి, బింగి మత్స్యగిరి పది రోజుల క్రితం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి మృతి చెందారు. ఆ కుటుంబాలకు అండగా నిలవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిని ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు కోరారు. స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి.. ఒక్కో కుటుంబానికి రూ.20వేల చొప్పున సోమవారం ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ నడిపల్లి యాదగిరి, మాజీ ఎంపీపీ మేడి నాగలక్ష్మియాదయ్య, నిమ్మల స్వామి, భీమగోని స్వామి, మాదగోని రుషికేష్, దేవలోకం, బోయపల్లి వెంకన్న, శంకర్, సత్తయ్య పాల్గొన్నారు.

15న సీపీఐ సభ

కనగల్: మండల కేంద్రంలో ఈ నెల 15న నిర్వహించనున్న సీపీఐ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి కోరారు. సోమవారం కనగల్ ఎక్స్ రోడ్‌లో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, జోగు సురేందర్, దోటి పాండరీ, బోగరి రామకోటి పాల్గొన్నారు.

దుకాణదారులకు జరిమానా

చిట్యాల: మున్సిపాలిటీలోని పలు దుకాణాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను గుర్తించి, దుకాణ యజమానులకు జరిమానా విధించారు. ఆయన వెంట వార్డు ఆఫీసర్ సురేష్, జవాన్ ప్రణీత్ ఉన్నారు.

ప్రైవేట్ పీఈటీల సంఘం అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్



నకిరేకల్ : తెలంగాణ ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల (పీఈటీ) సంఘం నకిరేకల్ మండల అధ్యక్షుడిగా నిమ్మల శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నోముల సైదులుయాదవ్ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఆ సంఘం మండలం సమావేశంలో నూతన కమిటీ ఎనుకున్నారు. ఈ సమావేశంలో పీఈటీలు ఉపేందర్, రాకేష్, నర్సింహారావు, నరేష్, గిరి పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు

నార్కట్‌పల్లి : పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు పదవులు తప్పకుండా వస్తాయని బీజేవైఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌కుమార్‌లను సోమవారం మండల కేంద్రంలో సన్మానించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు కొరివి శంకర్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేశ్, వడ్డగోని రామలింగం, నోముల నాగరాజు, పంజాల శేఖర్, రూపని సతీష్, పరమేష్, రమేష్, శివ, ప్రవీణ్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

చండూరు : మండలంలోని ఉడుతలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎంపీడీఓ యాదగిరి సోమవారం పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఉడుతలపల్లి గ్రామంలో 60 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా అందులో 14 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. సోమవారం మరో నలుగురు లబ్ధిదారులు ముగ్గు పోసి బునాది పనులు ప్రారంభిస్తుండడంతో వాటిని ఎంపీడీఓ యాదగిరి పరిశీలించారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు తీసుకోండి

చండూరు : ఉపాధి హామీ పనుల్లో వేసవి దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ యాదగిరి సూచించారు. సోమవారం ఉడుతలపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు ఉన్నారు.